క్లుప్తంగా

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత



మొక్కలు నాటుతున్న పీహెచ్‌సీ వైద్యాధికారి చిరంజీవి

పాలకొండ రూరల్: మండలంలోని ఎం.సింగుపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆవరణలో మొక్కలు నాటే కార్యక్రమం సోమవారం చేపట్టారు. వైద్యాధికారి కడియం చిరంజీవి, సిబ్బంది కలిసి పలు మొక్కలు నాటారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మొక్కల పెంపకంతోనే పర్యావరణ పరిరక్షణ సాధ్యమని, ప్రతిఒక్కరూ తమవంతు బాధ్యతగా మొక్కలు పెంచి, సంరక్షించాలన్నారు. కార్యక్రమంలో ఉపాధి హామీ జేఈ జి.పద్మజ, క్షేత్ర సహాయకురాలు పార్వతి తదితరులు పాల్గొన్నారు.

చిన్నారుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలి

- డీఐఓ జగన్మోహనరావు



పదమాయవలసలో చిన్నారిని పరిశీలిస్తున్న డీఐఓ జగన్మోహనరావు

బలిజిపేట: చిన్నారుల ఆరోగ్యంపట్ల వైద్య శాఖ, తల్లితండ్రులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి (డీఐఓ) జగన్మోహనరావు కోరారు. ఈ మేరకు మండలంలోని అరసాడ పీహెచ్‌సీని సోమవారం ఆయన ఆకస్మికంగా పర్యవేక్షించారు. పీహెచ్‌సీలో ఓపీ నిర్వహణ, మందులు, వ్యాక్సిన్ నిల్వలు, ల్యాబ్, ప్రసూతిగది, వార్డులను పరిశీలించారు. పీహెచ్‌సీకి వచ్చే రోగులతో మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు. సీజనల్ రోగాలకు అవసరమైన మందులు, పాము కాటు, కుక్కకాటు మందులు అందుబాటులో ఉంచాలని వైద్య సిబ్బందికి సూచించారు. వ్యాక్సిన్ నిల్వలను తనిఖీ చేశా రు. సిబ్బంది సమయపాలన పాటించి రోగులకు అవసరమైన సేవలను అందించాలని కోరారు. అనంతరం పదమాయవలస గ్రామంలో గృహ సందర్శన చేశారు. చిన్నారులకు వ్యాధినిరోధక టీకాలు వేసిందీ? లేనిదీ అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో వైద్యాధికారిణి ఎం.శివగాయత్రి, ఈఓ నారాయణరావు, పాల్గొన్నారు.

అగ్నిమాపక కేంద్రాన్ని తనిఖీ చేసిన డీఎఫ్ఓ



డ్రిల్స్‌ను పరిశీలిస్తున్న జిల్లా అగ్నిమాపక అధికారి శ్రీనుబాబు

సాలూరు: పట్టణంలోని అగ్నిమాపక కేంద్రాన్ని జిల్లా అగ్నిమాపక అధికారి శ్రీనుబాబు సోమవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సిబ్బంది డ్రిల్, లీడర్ డ్రిల్, పికింగ్‌అప్ డ్రిల్ పరిశీలించి రికార్డులను తనిఖీ చేశారు. అందరూ నిబద్ధతతో పనిచేయాలని ఈ సందర్భంగా సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో స్టేషన్ ఫైర్ ఆఫీసర్ సుధాకరరావు, సిబ్బంది పాల్గొన్నారు.

మహిళా సంఘాల అభివృద్ధిపై శిక్షణ



మాట్లాడుతున్న ఐబీ ఏపీఎం జయమ్మ

బలిజిపేట: మహిళా సంఘాలను అభివృద్ధి చేసుకోవడం ఎంతో అవసరమని ఏపీఎం జయమ్మ తెలిపారు. వైఎస్సార్ క్రాంతి పథం భవనంలో వీఓఏలకు శిక్షణ కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామాల్లో ఉండే చిన్న,చిన్న సంఘాలను బలోపేతం చేయడం, దాని ద్వారా గ్రామ ఐక్య సంఘాలు, మండల సమాఖ్య బలోపేతం, అభివృద్ధి చేసుకోవాలని సూచించారు. అందుకు గాను మహిళా సంఘాలు ఆర్థికంగా ఎదగాలని ఆకాంక్షించారు. ప్రభుత్వం అందిస్తున్న వివిధ పథకాలతో మహిళలు జీవనోపాధి మెరుగుపరుచుకోవాలని పిలుపునిచ్చారు. అలాగే పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని హితవు పలికారు. కార్యక్రమంలో ఏపీఎం ఉమామహేశ్వరరావు, సీసీలు, వీఓఏలు పాల్గొన్నారు.

ఉద్ధృతంగా తోటపల్లి కుడికాలువ

సీతానగరం: మండలంలోని బుడ్డి మీదుగా తోటపల్లి సాగునీటి ప్రాజెక్ట్ కుడి కాలువ ద్వారా నీరు ఉద్ధృతంగా ప్రవహిస్తోంది. కాలువ పరిధిలో గ్రామాల్లో ఉభాలు పూర్తి కావస్తున్నందున నీరు అవసరాన్ని దృష్టిలో ఉంచుకుని సోమవారం సాయంత్రం నీరు విడుదల చేయడంతో ప్రవహిస్తోంది.

ఏకగ్రీవంగా ఉప సర్పంచ్‌ల ఎన్నిక

- అన్నిచోట్ల వైఎస్సార్ సీపీ మద్దతుదారులదే గెలుపు
- విజేతలకు అభినందనల వెల్లువ



కొమరాడ: ఉప సర్పంచ్‌గా ఎన్నికైన గాయత్రిని అభినందిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు



కురుపాం: ఉప సర్పంచ్‌గా ఎన్నికైన తోయక భారతి, తదితరులు

కురుపాం: పాలకొండ, కురుపాం నియోజకవర్గాల్లోని మండలాల్లో పలు పంచాయతీల్లో జరిగిన ఉప సర్పంచ్ ఎన్నికలు సోమవారం సజావుగా జరిగాయి. అన్నిచోట్లా వైఎస్సార్ సీపీ మద్దతుదారులే గెలుపొందారు. ఈ మేరకు వారికి ఎన్నికల అధికారులు నియామకపత్రాలు అందజేశారు. కురుపాం మండలంలోని బియ్యాలవలస పంచాయతీలో జరిగిన ఎన్నికలో తోయక భారతి ఉప సర్పంచ్‌గా ఎన్నికైనట్లు ఈవో రామచంద్రరావు ప్రకటించారు. కార్యక్రమంలో కురుపాం ఎంపీపీ శెట్టి పద్మావతి, జిల్లా వైఎస్సార్ సీపీ గ్రీవెన్స్‌సెల్ నాయకుడు శెట్టి నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

జియ్యమ్మవలస: మండలంలోని కొండచిలకాం పంచాయతీ ఉప సర్పంచ్‌గా హిమరిక ప్రసాద్ ఎన్నికైనట్లు ఎన్నికల అధికారి పార్థసాయి తెలిపారు. ఈ మేరకు ఆయనకు సర్పంచ్, వార్డు మెంబర్లు, గ్రామస్తులు అభినందనలు తెలిపారు.

కొమరాడ: మండలంలోని గుమడ పంచాయతీ ఉప సర్పంచ్ ఎన్నికలో ఆరో వార్డుకు చెందిన చందక గాయత్రి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ మేరకు ఆమెను మండల పార్టీ కన్వనర్ ద్వారపురెడ్డి జనార్దన్‌రావు, గ్రామస్తులు అభినందించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.మధుసూదన్‌రావు, కొమరాడ పీఏసీఎస్ చైర్మన్ ఎం.సూరపునాయుడు, సర్పంచ్ డి.కళావతి పాల్గొన్నారు.

పాలకొండ రూరల్: మండలంలోని అన్నవరం గ్రామంలో జరిగిన ఉప సర్పంచ్ ఎన్నికలో రాగోలు అరవింద్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ మేరకు ఎన్నికల రిటర్నింగ్ అధికారి డొంక త్రినాధులు ఆయనకు ధ్రువపత్రం అందజేశారు. విజేతను సర్పంచ్ జి.రాజశేఖర్, వార్డు మెంబర్లు అభినందించారు.



జియ్యమ్మవలస: ఉప సర్పంచ్‌గా ఎన్నికైన ప్రసాద్‌కు ధ్రువీకరణపత్రం అందజేస్తున్న ఎన్నికల అధికారి పార్థసాయి



పాలకొండ రూరల్: అన్నవరం గ్రామ సచివాలయంలో ఉప సర్పంచ్ ఎన్నిక నిర్వహిస్తున్న అధికారులు

గిరిజన స్పందనకు 48 వినతులు

- ఐటీడీఏ పీవో కల్పనాకుమారి



వినతులు స్వీకరిస్తున్న ఐటీడీఏ పీవో కల్పనాకుమారి

సీతంపేట: స్థానిక ఐటీడీఏ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన స్పందన కార్యక్రమానికి పలువురి నుంచి పలు సమస్యల పరిష్కారానికి మొత్తం 48 వినతులు వచ్చినట్లు ఐటీడీఏ పీవో కల్పనాకుమారి తెలిపారు. కుట్టుమిషన్ ఇప్పించాలని గాటిగుమ్మడ గ్రామానికి చెందిన అనూష, మేకల కొనుగోళ్లకు రుణం మంజూరు చేయాలని కొండవెనిగోర గ్రామస్తుడు బిడ్డిక భాస్కరరావు, మినీ అంగన్‌వాడీ కేంద్రం ఏర్పాటు చేయాలని కోసిమానుగూడ గ్రామస్తులు, సున్నంగూడ గ్రామంలోని ప్రాథమిక పాఠశాలలో భాషా వలంటీర్‌ను నియమించాలని గౌరయ్య, న్యాయశాస్త్రం చదువుకు ఆర్థికసాయం చేయాలని కుండంగి కవిత, విద్యుత్ లైన్లు మార్పు చేయాలని పాండ్ర గ్రామానికి చెందిన జర్మియా వినతిపత్రాలు సమర్పించారని పేర్కొన్నారు. ఆయా సమస్యలను పరిశీలించిన పీవో వాటి పరిష్కారానికి సంబంధిత అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో ఈఈ సింహాచలం, డీడీ శ్రీనివాసరావు, డిప్యూటీ ఈవో లిల్లీరాణి తదితరులు పాల్గొన్నారు.

కొబ్బరి మొక్కల పంపిణీ



రైతులకు కొబ్బరి మొక్కలు పంపిణీ చేస్తున్న కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్తలు

కురుపాం: కృషి విజ్ఞాన కేంద్రం సేవలు సద్వినియోగం చేసుకోవాలని చింతపల్లి అసోసియేట్ రీసెర్చ్, ఆర్ఏఆర్ఎస్ ఎం.సురేష్‌కుమార్ రైతులను కోరారు. సోమవారం మండలంలోని రస్తాకుంటుబాయి కృషి విజ్ఞాన కేంద్రంలో ప్రోగ్రాం కో- ఆర్డినేటర్ టి.ఎస్.ఎస్.కె.పాత్రో ఆధ్వర్యంలో రైతులకు కొబ్బరి మొక్కలు పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రత్యేకంగా కర్ణాటక రాష్ట్రం నుంచి తెప్పించిన ఈ కొబ్బరి మొక్కల ద్వారా అధిక ఫలసాయం అందుతుందన్నారు. ప్రస్తుతం 4 వేల కొబ్బరి మొక్కలు అందజేశామని, త్వరలోనే జీడిమామిడి మొక్కలు కూడా అందజేస్తామన్నారు.

త్వరితగతిన అభివృద్ధి పనులు పూర్తి చేయాలి



రామాలయం కాలనీలో సీసీ రోడ్లు, కాలువల నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న జెడ్పీటీసీ రాధిక

- ఐటీడీఏ పీవో కల్పనాకుమారి

సీతంపేట: త్వరితగతిన అభివృద్ధి పనులను పూర్తి చేయాలని ఐటీడీఏ పీవో కల్పనాకుమారి ఆదేశించారు. సోమవారం స్థానిక ఐటీడీఏ కార్యాలయంలో సీతంపేట, వీరఘట్టం మండలాలకు చెందిన పీఆర్, ఆర్‌డబ్ల్యూఎస్, ఇంజినీరింగ్ అధికారులతో సమావేశమైన ఆమె, గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ద్వారా మంజూరైన నిధులతో జరుగుతున్న అభివృద్ధి పనులపై సమీక్షించారు. ప్రారంభం కాని పనులను వెంటనే చేపట్టాలని, ఇప్పటికే ప్రారంభించిన పనులను వీలైనంత త్వరగా పూర్తి చేయాలని తెలిపారు. బిల్లులు కూడా వెంటనే అప్‌లోడ్ చేయాలన్నారు. ఈ నెలాఖరు నాటికి 80 శాతం మేర పనులు పూర్తయ్యేలా చూడాలన్నారు. కార్యక్రమంలో ఇంజినీరింగ్ అసిస్టెంట్లు, సర్పంచ్‌లు పాల్గొన్నారు.

సీసీ రోడ్డు నిర్మాణానికి భూమిపూజ..

గుమ్మలక్ష్మీపురం: మండలంలోని ఎల్విన్‌పేట సచివాలయం-1, 2 పరిధిలో పలు అభివృద్ధి పనులకు జెడ్పీటీసీ మండంగి రాధిక సోమవారం భూమిపూజ చేశారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ద్వారా మంజూరైన రూ.80 లక్షల నిధులతో రామాలయం కాలనీలో సీసీ రోడ్లు, కాలువల నిర్మాణం చేపడుతున్నట్లు ఆమె తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ ఆర్.చైతన్య స్రవంతి, వైస్ ఎంపీపీ నిమ్మక శేఖర్, రజక కార్పొరేషన్ డైరెక్టర్ గోరిశెట్టి గిరిబాబు, వైఎస్సార్ సీపీ ఎస్టీ సెల్ మండల కన్వీనర్ తోయక గోపాల్, సచివాలయం కన్వీనర్ కె.సూర్యప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో ఎరువుల విక్రయం

సీతానగరం: మండలంలోని వివిధగ్రామాల్లో ఉన్న ఎరువుల విక్రయ కేంద్రాల్లోని ఎరువులు వ్యవసాయ శాఖ అనుమతితో నిర్దేశించిన ధరకు రైతులకు విక్రయిస్తారని ఏఓ ఎస్.అవినాష్ తెలిపారు. ఈ మేరకు సోమవారం ఆయన పెదభోగిలి వరిచేను పొలం గట్లపై రైతులు కంది విత్తనాలు నాటే పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వరిచేను మడుల గట్లపై కందిపంట వేయడం వల్ల ఫలసాయం వస్తుందని, పచ్చిక మొలకెత్తడాన్ని తగ్గిస్తుందని చెప్పారు. రైతులు పొలం గట్లపై వ్యవసాయ సహాయకుల సూచనల మేరకు కందిపంట వేసుకోవాలని సూచించారు. ఎరువుల భ్యతపై మాట్లాడుతూ మండలంలో రైతులు ఖరీఫ్ పంట సాగుచేస్తున్న భూములకు అవసరమైన ఎరువుల నిల్వలున్నాయని ఆందోళన చెందాల్సిన పనిలేదన్నారు.

17.000 ఎకరాల్లో వరి సాగు

మండలంలో ఖరీఫ్ సీజన్‌లో రైతులు 17,000ఎకరాల్లో వరిసాగు చేపట్టారని ఏఓ ఎస్.అవినాష్ తెలి పారు. రైతుల పంటలను ఈ క్రాప్ నమోదు చేస్తామన్నారు.

ప్రమాదాల నివారణకు పోలీసుల చర్యలు

సీతానగరం: మండలంలోని రాష్ట్ర రహదారిలో సువర్ణముఖి నదిపై వంతెన వద్ద ఏర్పడిన గోతులను ఎస్సై కె.నీలకంఠం ఆధ్వర్యంలో సోమవారం పూడ్చివేసే పనులు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర రహదారిలో వంతెన వద్ద ఇటీవల కురిసిన వర్షాలకు రోడ్డు గోతుల మయం కావడంతో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయని ఆందోళన వ్య క్తం చేశరు. అపరిచితులు వాహనాలతో రాకపోకలు చేయడం వల్ల గోతిని పరిశీలించక ముందే బైక్‌లు అందులో పడి బోల్తా కొట్టే ప్రమాదముందన్నారు. రోడ్డు ప్రమాదాల నివారణకు సిబ్బంది సహకారంతో గోతులను పూడ్చి వేయించినట్లు తెలిపారు.

గృహ నిర్మాణాలను వేగవంతం చేయాలి



గృహ నిర్మాణ పనులను పరిశీలిస్తున్న ప్రజాప్రతినిధులు

పాలకొండ రూరల్: మండలంలోని పనుకువలస గ్రామంలో జగనన్న కాలనీలో నిర్మిస్తున్న గృహ నిర్మాణాలను సర్పంచ్ కోట మంజుభార్గవి సోమవారం పరిశీలించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ నిర్మాణాలు చేపడుతున్న వారికి ప్రభుత్వం సకాలంలో బిల్లులు చెల్లింపు చేస్తుందన్నారు. అలాగే అవసరమైన వారికి నిర్మాణ సామగ్రి అందివ్వడం జరుగుతుందన్నారు. కాలనీలో రోడ్లు, విద్యుత్, నీటి సదుపాయాలు కల్పించడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీ కె.అజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

రక్తదానానికి ముందుకు రావాలి



రక్తదాతలకు సర్టిఫికెట్లు అందజేస్తున్న రెడ్‌క్రాస్ సిబ్బంది

సీతంపేట: రక్తదానం ప్రాణదానంతో సమానమని, యువతీయువకులంతా రక్తదానానికి ముందుకు రావాలని ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ జిల్లా చైర్మన్ జగన్‌మోహన్‌రావు అన్నారు. స్థానిక గిరిజన సంక్షేమ బాలురు ఆశ్రమ పాఠశాలలో రక్తదాన శిబిరం సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా దాతల నుంచి మొత్తం 70 యూనిట్ల రక్తం సేకరించినట్లు ఆయన తెలిపారు. రక్తదానం చేస్తే ఆరోగ్యం పోతుందన్న అపోహ అందరిలో ఉందని, నిజానికి రక్తదానం చేయడం వల్ల ఆరోగ్యమే తప్ప అనారోగ్యం లేదన్నారు. మనమిచ్చే రక్తం ఆపదలో ఉన్న వారి ప్రాణం కాపాడడమే కాకుండా, వారి కుటుంబానికి అండగా నిలిచినవారమవుతామన్న విషయం మర్చిపోకూడదన్నారు. అనంతరం రక్తదాతలకు సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో ఎంపీపీ బి.ఆదినారాయణ, ఐటీఐ ప్రిన్సిపాల్ ఎం.గోపాలకృష్ణ, ప్రధానోపాధ్యాయుడు చంద్రరావు, రెడ్‌క్రాస్ సిబ్బంది పి.చైతన్యకుమార్, కె.సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఇసుక తరలించేందుకు అనుమతులు ఇవ్వండి



తహసీల్దార్ అప్పారావుతో మాట్లాడుతున్న పీఆర్ ఏఈఈ గౌరీశంకర్

భామిని: ఇసుక తరలించేందుకు అనుమతులు ఇవ్వాలని తహసీల్దార్ నీలాపు అప్పారావును పీఆర్ ఏఈఈ జి.గౌరీశంకర్ కోరారు. ఇదే విషయమై సోమవారం మండల కేంద్రంలో జరిగిన స్పందన కార్యక్రమంలో తహసీల్దార్‌ను కలిసిన ఆయన గిరిజన ప్రాంతాల్లో జరుగుతున్న ప్రభుత్వ భవన నిర్మాణాలు, గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ద్వారా మంజూరైన అభివృద్ధి పనులకు ఇసుక సమస్య ఎక్కువగా ఉందన్నారు. స్పందించిన తహసీల్దార్ ఉన్నతాధికారుల నుంచి అనుమతులు వచ్చిన వెంటనే తెలియజేస్తామన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తం



రోగులకు అందిస్తున్న సేవలపై ఆరాతీస్తున్న విశాఖ జోనల్ మలేరియా ఆఫీసర్ శాంతిప్రభ

సీతంపేట: వర్షాకాలం నేపథ్యంలో ప్రబలే సీజనల్ వ్యాధులపై ప్రజలు, వైద్యారోగ్య సిబ్బంది అప్రమత్తం కావాలని విశాఖ జోనల్ మలేరియా ఆఫీసర్ శాంతిప్రభ అన్నారు. మండలంలోని దోనుబాయి పీహెచ్‌సీతో పాటు గుజ్జి, మొగదార గ్రామాల్లో సోమవారం పర్యటించిన ఆమె మలేరియా, డెంగీ జ్వరాలతో బాధపడుతున్న వారి వివరాలపై ఆరాతీశారు. అనంతరం మలేరియా జ్వరపీడితులతో మాట్లాడి, పలు సూచనలు, సలహాలు చేశారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, నీటి నిల్వలు ఉన్నచోట దోమలు ఎక్కువగా పెరిగే అవకాశం ఉందని, ఈ నేపథ్యంలో నీటి నిల్వలు లేకుండా చూడాలన్నారు. అలాగే మురుగుకాలువల్లో దోమల నివారణ మందు పిచికారీ చేయాలన్నారు. ప్రతిఒక్కరూ దోమతెరలు వాడాలని, కాచివడపోసిన నీటిని తాగాలన్నారు. ఆ తర్వాత స్థానిక ఏరియా ఆస్పత్రిని సందర్శించి, అక్కడి రోగులకు అందిస్తున్న వైద్యసేవలపై ఆరాతీశారు. కార్యక్రమంలో సూపరింటెండెంట్ శ్రీనివాసరావు, ఏడీ కేవీఎస్ ప్రసాద్, ఏఎంవో సూర్యనారాయణ, డీవీబీవో శ్రీకాంత్, సబ్‌యూనిట్ ఆఫీసర్ మోహన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

సెకెండ్ ఫేజ్‌లో 18 గ్రామాల్లో రీ సర్వే పూర్తి

సీతానగరం: జగనన్న 'భూ' హక్కు, 'భూరక్ష రీ సర్వే కార్యక్రమంలో భాగంగా సెకెండ్ ఫేజ్‌లో ఆర్ఓఆర్ సర్వే పనులు నెలాఖరునాటికి పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని తహసీ ల్దార్ ఎన్వీ రమణ అన్నా రు. ఈ మేరకు సోమవారం ఆయన 'రీ' సర్వే పనులపై నిర్దేశించిన వీఆర్వోలతో కార్యాలయంలో రీ సర్వే డీటీ చిట్టెమ్మ అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మండలంలో సెకెండ్ ఫేజ్‌లో రీ సర్వే పూర్తిచేసిన 18 స్టోన్ ప్లాంటేషన్ చేయాల్సి ఉండగా ఇప్పటికి 6 గ్రామాల్లో పూర్తయిందన్నారు. మరో 6 గ్రామాల్లో ఈనె 25 నాటికి స్టోన్ ప్లాంటేషన్ పూర్తి చేయాలని నిర్ణయించినట్లు తెలిపారు. ఇప్పటికే వీఆర్వోలు, సిబ్బంది సహకా రంతో పనులు నిర్దేశించిన గడువులోగా పూర్తి చేయడానికి చర్యలు తీసుకున్నామని తెలియజేశారు.

పీఎం కిసాన్ లబ్ధికి ఆన్‌లైన్..

మండలంలోని రైతులకు సంబంధించి పీఎం కిసాన్ పథకం అమలుకు ఆన్‌లైన్ వేగవంతం చేయడానికి పనులు చురుగ్గా జరుగుతున్నాయని తహసీల్దార్ ఎన్వీ రమణ అన్నారు. పీఎం కిసాన్‌కు సంబంధించి రైతుల నుంచి 320 దరఖాస్తులు వచ్చాయని వారందరికీ పీఎం కిసాన్ పథకం లబ్ధి చూకూరేందుకు ఆన్‌లైన్ ప్రక్రియ జరుగుతోందని చెప్పారు. కార్యక్రమంలో ఆర్ఐ ఎస్.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

విజయవంతంగా మోకాలి శస్త్రచికిత్స

పాలకొండ: పాలకొండలోని శ్రీవిజయ మల్టీస్పెషాలిటీ ఆస్పత్రి వైద్యులు 67 ఏళ్ల మహిళకు మోకాలి మార్పిడి శస్త్రచికిత్సను విజయవంతంగా పూర్తిచేశారు. ఎముకుల వైద్య నిపుణుడు రాజేష్‌కుమార్ మాట్లాడుతూ డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్యశ్రీ, ఈహెచ్ఎస్ సేవలు అందుబాటులో ఉన్నాయన్నారు. ప్రభుత్వం అందించిన ఆర్థిక సాయంతో తెట్టంగి గ్రామానికి చెందిన మీసాల కృష్ణవేణికి మోకాలి మార్పి శస్త్రచికిత్సను ఆవిజయవంతంగా పూర్తిచేశామని చెప్పారు.



కేంద్రంపై సీపీఎం సమరభేరి

కేంద్ర ప్రభుత్వంపై సీపీఎం సమరభేరి మోగించింది. ఆగస్టు 30వ తేదీ నుంచి ఈ నెల 4వ తేదీ వరకు జరిగిన ఈ కార్యక్రమంలో ఆ పార్టీ నేతలంతా మోదీ సర్కారు చేపట్టిన ప్రజావ్యతిరేక విధానాలను ఎండగట్టారు. ఓ వైపు ఇంధన ధరలతో పాటు నిత్యవసర ధరలు తగ్గించాలని కోరుతూనే మరోవైపు ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటీకరణ చేయాలన్న ఆలోచనను విరమించుకోవాలని నినదించారు. అలాగే కేంద్ర ప్రభుత్వ పాలన, ప్రధాని మోదీ పనితీరుపై ప్రజాభిప్రాయం, సంతకాల సేకరణ చేపట్టారు. వచ్చే ఎన్నికల్లో మతతత్వ పార్టీ బీజేపీకి తగిన బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు.

-పాలకొండ, కురుపాం సాక్షి నెట్‌వర్క్.



భామిని: తహసీల్దారు అప్పారావుతో మాట్లాడుతున్న సీపీఎం నాయకులు తిరుపతిరావు, జగన్నాయకులు, మిన్నారావు



పాలకొండ: కేంద్రానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తున్న సీపీఎం నేతలు రమణారావు తదితరులు



కురుపాం: ప్రధాని మోదీ పాలనను నిరసిస్తూ ధర్నా చేస్తున్న సీపీఎం నేతలు

